
# కొత్త రిక్షా



రంగయ్య రిక్షా తొక్కుతున్నాడు.

పిక్కలు దుక్కల్లాగా  ఒంటిమీద కండరాలు బంతుల్లాగ వయ్యారాలు పోతూ ఉండిన వయసు నుంచి రిక్షా తొక్కుతున్నాడు.

చూస్తూ చూస్తూ ఉండగానే పిక్కలు సన్నగిల్లినాయి. చెమట కార్చి కార్చి బంతుల్లాంటి కండరాలు బెండు తేలాయి. కండరాల మీద చర్మం సళ్ళొదిలి ముడతల ముడతలుగా వేలాడుతూ ఉంది. వెన్నెముక వంగింది. తలమీద గుబురు వెంట్రుకలు గాలికి ఎగిరిపోయాయి.

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరగడం వాడు చూడలేదు. అందుకే నమ్మడం లేదు. కానీ గోవిందరాజస్వామి తేరు మాత్రం తనకు తెలిసి యాభైసార్లు ప్రదక్షిణం చేసిందంటాడు. ఆ తేరు కదిలేది ఏడాది కొక్కసారి. 'అమ్మో! అప్పుడే యాభై ఏండ్లయిపొయ్‌నాయే!' అనుకొంటూ దీనంగా రిక్షా వైపు చూశాడు. ఆ తరువాత రెండు అరచేతుల్ని చూసుకొన్నాడు. ఆ చూపుల్లో ఎంత పరిశీలనో?

"ఈ సేతిమిందగా ఎన్ని రిక్షాలు మారిపొయ్‌నాయో" అంటూ భారంగా నిట్టూరుస్తాడు.

ఆ నిట్టూర్పును గాలి నిర్దయగా తనలో కలుపుకొంటుంది.

నిజమే! తెలిసికొంత తెలియక కొంతగా జరిగి పోయిన యాభై యేండ్ల జీవితకాలంలో రంగయ్య చేతుల మీదుగా ఎన్నో రిక్షాలు మారాయి. కాని తన రాత మాత్రమే మారలేదు.

అందుకే రంగయ్య రిక్షా తొక్కుతూనే ఉన్నాడు.

రంగయ్య రిక్షా తొక్కుతుంటాడు. ఆ ఊళ్లో రిక్షా రహదారిమీద పోతూ ఉండవచ్చు. సందుగొందుల్లో పోతూ ఉండవచ్చు. అది ఎంత మంచి బాడుగైనా కావచ్చు. రిక్షామీద ఎవరైనా కూర్చుని ఉండవచ్చు. గంట పదిన్నర అయివుంటుందని తోస్తే చాలు. రంగయ్య అటు ఇటు చూస్తాడు. గడియారం చేతికోసం గుటకలు మింగుతాడు. కంటపడ్డానే సమీపిస్తాడు. 'గంటెంత యిందయ్యా?' అని అడగతాడు. 'పదిన్నర' అంటే చాలు. ఖాళీ రిక్షా అయితే సమస్యేలేదు. బాడుగంటూ ఉంటే వెంటనే మార్చేస్తాడు. అరనిముషం ఆగకుండా ఇంటిదోవ పడ్తాడు.

అప్పుడు రంగయ్య రిక్షా తొక్కడం చూస్తే 'ఔరా' అని ముక్కుమీద వేలేసుకోవాల్సిందే. ఏదో పెట్టి మరిచినట్లు, పుట్టిమునిగినట్లు తొక్కుతాడు. దారిలో ఎవరైనా 'ఏయ్ రిక్షా' అని పిలిస్తే 'రాను పోరా బేటా' అన్నట్టుగా నిర్లక్ష్యంగా ఒక్కచూపు విసరతాడు. ఆసోబోసో మని గసపోసుకుంటూ తొక్కుతూ అడ్డంకుల్ని అవలీలగా దాటుతూ అతడు రిక్షా తొక్కుతున్న తీరు చూస్తే 'వయస్సుకు ఆవేశానికి సంబంధం లేదేమో?' అన్న సందేహం కలుగుతుంది.

ఆగ మేఘాలమీద వచ్చినట్టే వస్తాడు. ఇంటి ముందర బాటమీద రిక్షా నిలబెట్టతాడు. ఆ ఇంటి ముందర బాట మోకాటెత్తు మిట్ట. ఆ మిట్ట మీదనిలబెడితే అది దొల్లు దొల్లు పుచ్చకాయలా దొర్లిపోతుందని చక్రాలకు వెనకా ముందూ రాళ్ళు కడతాడు. రిక్షా 'హేండిల్ బార్' కు వేలాడగట్టిన తుండు గుడ్డ విప్పుకుంటాడు. మొగానికి ముంజేతులకు పట్టిన చెమట తుడుచుకొంటాడు. 'అబ్బా' అని నిట్టూరుస్తూ గుడిసింటి తాళం తీస్తాడు. ఆ గుడిసెలో మసక చీకటి. వెలుతురు నుంచి వచ్చిన కంటికి మసక మసగ్గా కనిపిస్తూ ఉంటుంది. అందుకే కండ్లు చించుకొంటాడు. సత్తులోటాను వెదికి చేతికందుకొంటాడు. కుండలో గుక్కెడు నీళ్ళు ముంచుకొని గొంతులో పోసుకొంటాడు. ఆ నీళ్ళు గొంతుజారక మునుపే వాకిట్లోకివస్తాడు. వాకిట్లో నిలబడి ఎదురు చూస్తుంటాడు.

ఆ వేళప్పుడు దానయ్య అదే దారిలో పోతూ ఉంటాడు.

అయితే రంగయ్య వైపు తిరిగి మళ్ళీ చూడకుండా వెళ్ళిపోతుంటాడు. అప్పుడు చూడాలి రంగయ్య మొగాన్ని. కత్తివేటుకు నెత్తురు చుక్క ఉండదు. ఏదో ఆశానిరాశల మధ్య పెనుగులాట. ఆ పెనుగులాటలో నిస్సహాయత. మనిషి విలవిలలాడి పోతుంటాడు.

అలా నిలబడి ఎదురు చూడడం నిన్నొక రోజు కాదు. మొన్నక రోజు కాదు. ఆ రేండ్లుగా అలా ఎదురుచూస్తూనే ఉన్నాడు.

తొలి రోజుల్లో 'ఏందానయ్యా? నాకేఁవన్నా జాబొచ్చిందా?' అని అతురుతగా అడిగేవాడు రంగయ్య. దానయ్యా కూడా ఒక్క క్షణం నిలబడి కొనముక్కు మీదికి జారిన చత్వారం అద్దాల్ని సర్దుకొని చేతిలో జాబుల పేర్పును ఈ కడనుంచి ఆ కడదాకా వెదికి, 'ఏం రాలేదు కదా రంగయ్యా!' అని ఓపిగ్గా సమాధానం చెప్పేవాడు. కొన్ని రోజులు జరిగేసరికి దానయ్య ఓపిక నశించింది. రంగయ్య నోరు తెరిచీ తెరవక ముందే 'వస్తే నేనేయిస్తాగద రంగయ్యా! నువ్వు అడగాల్నా?' అని సాగదీసేవాడు. మళ్ళీ కొంత కాలానికి 'నీకేఁవన్నా పనీపాటా లేదా రంగయ్యా?' అని విసుక్కొనేవాడు. ఇప్పుడు రంగయ్య వాకిట్లో నిలబడి ఎదురు చూస్తున్నా చూసీ చూడనట్లు తన దారిని తాను పోతున్నాడు.

అయినా రంగయ్యలో ఆశ చావలేదు.

తపాలా బంట్రోతు దానయ్య ఆ ప్రాంతానికి చేరుకొనేటప్పటికి దాదాపు పదకొండు గంటలవుతుంది. తపాలా ఎక్కువగా ఉంటే పదిపదిహేను నిముషాలు ఆలస్యమవుతుంది. బస్సులు రైళ్ళు ఆలస్యంగా వచ్చి తపాలా ఆలస్యంగా చేతికందితే అంతకంటే ఎక్కువ ఆలస్యంకూడా కావచ్చు. అయితే దినమూ రైళ్ళూ బస్సులు ఆలస్యంగా రావు. అందుకే దానయ్య ఎప్పుడో కానీ ఆలస్యంగా రాడు.

దానయ్య ఆ ప్రాంతానికి సరిగ్గా పదకొండు గంటలకే రావచ్చు. పదకొండు గంటలకు పదినిముషాలు అటో ఇటోగా రావచ్చు. అతడెప్పుడైనా రానీ! ఎంత ముందుగా అయినా రానీ. ఎంత ఆలస్యంగా అయనా రానీ. అతడక్కడికి చేరుకొనేటప్పటికి అయిదునిముషాలు ముందుగానే ఏ కాకమ్మ కబురందిస్తుందో కానీ అక్కడికి చేరుకొంటాడు రంగయ్య.

దానయ్య రోజూ వస్తున్నాడు. పోతున్నాడు.

రంగయ్య దానయ్య వైపు దీనంగాచూస్తూ నిలబడుతున్నాడు.

చుట్టుపక్కల వాళ్ళు చూస్తున్నారు. ఆ రేండ్లనుంచి చూస్తున్నారు. రంగయ్య వాకిట్లో నిలబడి ఎదురు చూస్తున్నాడు. రంగయ్యను చూడకూడదనుకొంటునే చూస్తున్నారు. ఇప్పుడైతే అలవాటైపోయింది కానీ, మొదట మొదటయితే ఆ కాలనీలో ఏ నోట విందామన్నా అదేమాట.

"ఆ ముసిలోడికి పిచ్చికానీ, నిజంగా కన్నతండ్రి మీద కలవరఁవే ఉంటే వాడిన్నాళ్ళూ గమ్మనుంటాడా? రాఁవ రాఁవ! ఏవి జన్మాలో ఏం పాడో? సేతులారా సెయ్యించుకుంటారు. కండ్లారాసూస్తానే ఉంటారు. మణిసట్టా మరుగైతే మర్సిపోతా ఉంటారు. కడుపుకేం తింటారో? ఏంపాడో? వాడొక యదవ. వాణ్ణి సదివించే దానికి ముసిలోడు ఎన్నితిప్పలు పడె. ఏంకత? తల్సుకుంటే కడుపు సెరువవతుంది. వాడికెట్లా మణుసొప్పిందబ్బా? నిమ్మకు నీరెత్తినట్టు నిమ్మళంగా ఉందాడే?" అని ఒక రంటే "ఒరే! ఇది కాలికాలంరా తండ్రీ! ఇప్పుడు ఎవుడు తండ్రి? ఎవుడు బిడ్డ? అని ఇంకొకడు ఐహిక బంధాల్ని ఒక మాటలో తుంచేస్తాడు.

కొంతమంది ఎదుటపడి వేదాంతమే మాట్లాడేవాళ్ళు.

"రంగయ్యా! నీ పిచ్చికాకపోతే ఇంకా ఏందయ్యా నువ్వెదురు చూసేది! అడ్డాల్నాడు బిడ్డలేకానీ గెడ్డాలోస్తే ఎవురికెవురయ్యా? రెక్కలొచ్చేదాకా సాకితివి. రెక్కలు ముక్కలేసుకోని సాకితివి. రెక్కలొచ్చేశా. ఎగిరిపాయ. దానికెవురేంచేస్తారు?"

చేసేదేముంది? ఏమీ లేదని రంగయ్యకూ తెలుసు. రంగయ్యకు పాఠం చెప్పిన వాళ్ళకూ తెలుసు. లేదంటే ఈ కర్మభూమిలో మనిషి ఏమీ చేయడానికి చేతకానపుడు వేదాంతం మాట్లాడేస్తాడు. సులువుగా మాట్లాడేస్తాడు. గురువులేని విద్య. ఖర్చులేని పనికూడా.

ఎవ్వరేమన్నా అనినీ రంగయ్య ఉలకడు. పలకడు. తన పనేమో? తానేమో? పదకొండు గంటలకు వాకిట్లో నిలబడి ఎదురు చూడడమేమో క్రమంతప్పకుండా చేస్తున్నాడు. ఏనాటికైనా ఒకనాటికి తన కొడుకు జాబురాస్తాడు. అది కూడా రమ్మని జాబు రాస్తాడు. తాను తప్పకుండా వెళ్ళతాడు. అన్న ఆశతోనే జీవిస్తున్నాడు.

జీవితానికి కష్టసుఖాలు!

కాలానికి రాత్రింబవళ్ళు!

'రాత్రి తరువాత పగలు. కష్టం తరువాత సుఖం. ఎటువంటి బ్రతుకులో అయినా ఏనాటికో ఒకనాటికి పొద్దు మొలవక పోదు' అన్న ఆశతోనే మనిషి జీవిస్తున్నాడు.

రంగయ్య కూడా అందరిలాంటి మనిషే!

అందుకే జీవిస్తున్నాడు కాబట్టే తూర్పున పట మెగరక ముందే నిద్ర లేస్తాడు. నిద్ర పడక మీదనే కూర్చుని తాను చిన్నప్పుడు బడిలో కంఠతా పట్టిన రామరామ శతకాన్ని మొదటి నుంచి చివరిదాకా వల్లిస్తాడు. అలానే గొణుక్కొంటూ గుడిసింటి ముందర నిలబెట్టిన రిక్షాముందర కూర్చుంటాడు. పాత గుడ్డతో శుభ్రంగా తుడుస్తాడు. 'ఎట్లైతికినా కలికానికంత మట్టి దొరకదులే.' అన్నంత తృప్తికలిగే దాక తుడస్తాడు. తరువాత ప్రదక్షిణం చేసినట్లు రిక్షా చుట్టు తిరగతాడు. 'రిక్షా శుభ్రంగా ఉంది' అన్న తృప్తి పెదవులపై చిరునవ్వుగా పూస్తే చేతులెత్తి మొక్కుతాడు కడుపున పుట్టిన బిడ్డకాకున్నా కడుపుకు కూడు పెడుతున్నందుకు. ఆ తరువాత గుడిసింటి కల్లంత దూరంలోని చేదబావి దగ్గరికి నడస్తాడు. నాలుగు బక్కెట్ల నీళ్ళు చేది నెత్తిన పోసుకుంటాడు. తిరిగి చూడకుండా ఇల్లు చేరుతాడు. గుడిసింట నట్టింట వేంకటేశ్వరుని పటం ముందు నిలబడతాడు.

"సాంఁవీ! ఏడు కొండలవాడా! నేనుపడిన బాదలూ నీకు తెల్సు. నా కండ్లెట్లా కాయలు కాసిపోతా ఉండాయో కండ్లారా సూస్తానే ఉండావ్. ఈ యదవలందురూ మాట్లాడ్తా ఉంటే కడుపు తరక్కపోతా ఉండాది. వాణ్ణేంఁవీ అనలేక ఈళ్ళను తిట్లేక నడిమిద్దెపడి నలిగిపోతా ఉండా. వాణ్ణయినా పిలిపించు. లేకుండేనన్నయినా తొందరగా నీ దగ్గిరికి తీసుకొనిపో! ఈ సూటిపోటు మాటలుపడ్తా నేనుండలేను" అని వేడుకొంటాడు.

పడక మీదనుంచి పారాయణం చేస్తే రాముడు పలకలేదు.

కన్నీళ్ళతో మనస్సును కడిగేసుకొన్నా వెంకన్న కరుణించలేదు.

అయినా రంగయ్య నమ్మకం చావలేదు.

అందుకే_

"మాయ చీకటి కోనలో కొన్నాళ్ళు మార్గంబు కానరాక

ఏ ఉపాయముగానక కొన్నాళ్ళు జన్మమెత్తితి రామరామ"

అని వాపోతూనే మళ్ళీ మాయచీకటి కోనలోనే అడుగు పెడుతున్నాడు తన రిక్షాతో.

రిక్షా చేత పట్టకమునుపు రంగయ్య లారీకూలీల మేస్త్రీ.

వయసులో చిన్నవాడైనా వాట మెరిగినవాడు కాబట్టి అవి బియ్యం బస్తాలైనా సరే! చింతపండు మూటలైనా సరే! బంతుల్లాగా ఆడుకొనేవాడు. అందుకే కూలీలందరికీ రంగయ్య అంటే గౌరవం. అతడు గీచినగీత దాటేవాళ్ళు కాదు. వాళ్ళు అడుగులకు మడుగులొత్తుతున్నారని రంగయ్య కూడా అధికారం చలాయించేవాడు కాదు. ఆడుతూ పాడుతూ లారీల్ని భర్తీ చేస్తూ, దింపుతూ ఆ పట్టణంలో రంగయ్య రాజాలా బతికేవాడు.

రంగయ్య రాజా లాంటి బతుకులో మెడపైకెత్తి చూస్తే మేడలేదు కానీ తలదాచుకోవడానికి ఒక చుట్టు గుడిసె ఉంది. ఆ చుట్టు గుడిసెలో పట్టపురాణి కాకపోయినా సంసారంలో పట్టు విడుపులు తెలిసిన అతని ఇల్లాలుంది. పేరు రాణెమ్మ. రంగయ్య రాణెమ్మా ఆ చుట్టు గుడిసెలో జీవితాన్ని ఒక పట్టు పట్టి చూస్తున్నారు.

రంగయ్యకు పెండ్లి అయి ఆరేండ్లయింది. ఈ ఆరేండ్ల జీవితం ఏచీకూ చింతా లేకుండా జరిగిపోయింది. అయితే ఇప్పుడు ఉన్నట్లుండి వాళ్ళకొక చింత పట్టుకొనింది.

అందుకే రాణెమ్మ దినంతప్పకుండా నవగ్రహాల గుడిచుట్టింది. మంగళవారం మంగళవారం రాహుకాలంలో గంగమ్మగుడిలో దీపంపెట్టింది. ప్రతి శుక్రవారం తాతయ్య గుంట కట్టమీద రాగిచెట్టు వేపచెట్టు పెనవేసుకొని ఆదిదంపతులై అలరారుతుంటే వాళ్ళకు పూజలుచేసి తడిబట్టల్తో నూటొక్కసార్లు చుట్టింది.

అయినా ఆమె కడుపు పండలేదు.

రంగయ్యకు దిక్కుతోచలేదు.

దినదినానికి అతనిలో హుషారు చచ్చిపోతూ ఉంది. నవ్వుతూ నవ్విస్తూ బస్తాలతో బంతులాడుతుండిన మనిషి తనవంతు పని తాను చేస్తున్నాడు. ఏదో పోగొట్టుకొన్నట్లు ముభావంగా తిరుగుతున్నాడు. కంట పడిన రాతికీ రప్పకూ మొక్కుతున్నాడు. పనీపాట లేకపోతే ఏ వీధి అరుగుమీదనో కూర్చొని ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు. అతని వాలకం ఒక రాగాన అంతుబట్టక కూలీలందరు చుట్టూచేరి గుచ్చిగుచ్చి అడిగితే "ఇంటి పేరు నిలబెట్టే దానికొక మొలక మొలవకపోతే ఇంక ఈ బతుకుండేవిలాబం? లేకేవి లాబం?" అని నిట్టూర్చాడు.

అందరు పక పక నవ్వారు.

రంగయ్య విస్తుపోయి చూస్తున్నాడు.

"ఒరే రంగా! నీకేఁవన్నా పిచ్చిగిచ్చి పట్టిందా? ఆరేండ్లకే అంతా అయిపొయ్‌నట్లు బాదపడ్తావుండావే? పదేండ్లకు సంతు గలిగినోళ్ళులేరా? పన్నెండేండ్లకు కలిగి నోళ్ళు లేరా? అప్పుడే కాటికి కాళ్ళు సాచుకొన్న ముసిలోడి మాదిర్తో కంటికి కడవడేడస్తా ఉండావే?" అని ఎత్తి పొడుస్తూనే ఎగతాళిచేశారు.

అయినా రంగయ్య తీరు మారలేదు.

రంగయ్య గబగబ లారీకి మూట లెక్కిస్తూ ఉంటాడు. లేదా దించుతూ ఉంటాడు. ఆ సమయంలో ఆదారి వెంబడిపోతూ ముద్దుగా బొద్దుగా ఒక పాప కంటపడ్తేచాలు. చేస్తున్నపని ఆపి ఆ పాప వైపు రెప్పార్చకుండా చూస్తూ నిలబడతాడు.

అదిగోడకు తగిలించిన కేలండరైనా కావచ్చు. గాలికి కొట్టుకొని పోతున్న పాతపత్రిక అయినా కావచ్చు. అందమైన పిల్లవాడిబొమ్మ అగుపిస్తేచాలు. ఆ బొమ్మవైపే చూస్తూ కన్నీళ్ళు కారుస్తుంటాడు.

నిజంగా రంగయ్యకు పిచ్చి పట్టిందనుకొన్నారు కూలీలు.

రంగయ్యకు నిజంగానే పిచ్చి పట్టింది.

మేస్త్రీ పనికి రాజీనామా చేశాడు.

'అయ్యో కుయ్యో' మన్నారు కూలీలు. అందరు కలసి రంగయ్య ఇంటికి పరుగెత్తారు.

గుడిసింట ముందర నింపాదిగా గొంతు కూర్చుని రిక్షాతుడుచుకొంటున్నాడు రంగయ్య. అందరికీ కడుపు రగిలింది.

"ఒరే రంగా! ఇదేఁవన్నా బాగుండాదంట్రా. నిన్నేనమ్ముకున్నాం. నువ్వు చెప్పినపని చేసినాం. నువ్వు ఇచ్చినంత తీసుకున్నాం. ఊళ్ళో నీకుండే పరపతి మాకేడ ఏడ్సింది. ఒళ్ళొంచి పన్జేసేదానికి తెల్సు కానీ ఒకళ్ళతో మాట్లాడే వగాతగా మాకేంతెల్సు? ఉన్నట్టుండి మమ్మల్నిట్టా నట్టేట్లో ముంచేస్తే ఎట్లరా?"

ఇది అందరి అభిప్రాయం. అయితే పలికింది మాత్రం ఒక్కగొంతే.

కానీ రంగయ్య తలెత్తకుండానే రిక్షా తుడుచుకొంటున్నాడు.

"చెవల్లో చెట్లేఁవన్నా మొల్సినాయా?

అడగతా ఉండేది నిన్నేరా!"

"బాగాలేదని నాకూ తెల్సు"

"అయితే లెయ్ పోదాం"

"నేను రాలేన్రా"

"ఇదేం పోగాలంరా నీకు? రెండు లారీలు దించి మూడు లారీల కెక్కిస్తే సీకూ సింతా లేకుండా మనబతుకు లెళ్ళిపోతావుంటే పొద్దుగూకులూ రిక్షా తొక్కాలంటావే? ఇదేం కర్మరా నీకు?"

"ఒరే, వొళ్ళించి పన్జేసుకోవాల్నే కాని సంపాయించే దేవుండాదిరా? ఎట్టయినా సంపాయించుకోవచ్చు. అయితే చేసే పన్లో తృప్తి ఉండాల్రా"

"తృప్తి లేకుండా ఇప్పుడు నీకేవయిందని?"

"నేన్జేస్తుండే పనిలో నాకు తృప్తిలేదు."

"రిక్షా తొక్కితే ఉంటుందో?"

"అది మీకేం తెలుసురా?"

"తెల్దనేగదా అడగతావుండేది"

"ఒరే! బుద్దెరిగిన నాట్నుంచి మనబతుకులన్నీ ఈ రోడ్లమిందనే గడ్సినాయి. ఈ రోడ్లమింద మనకండ్లముందర్నే ఎన్నో రిక్షాలొస్తావుండె. పోతావుండె. వాటి దోవవాటిది. మన్దోవ మన్దిగా ఉండె. కానీ మొన్నొకనాడు. రొండుబార్ల పొద్దెక్కి ఉంటింది. ఒక రిక్షా కంటపడింది. నిదానించి చూసినా. రిక్షానిండా పిల్లకాయలు. పచ్చనిక్కర్లు... తెల్లసొక్కాలు. రకరకాల పువ్వుల్ని గుత్తులు గుత్తులుగా కట్టి రిక్షాకు లోడ్ చేసినట్లుంది. చూస్తా చూస్తా ఒళ్ళుట్లానే మర్చిపాయ్‌నా!"

"కాగితాల మింద బొమ్మల్ని చూస్తేనే కండ్లనీళ్ళు పెట్టుకుంటా ఉంటివే? ఇంక కంటెదట పిలకాయలుంటే ఒళ్ళేనా? ఈ ప్రెపంచాన్నే మర్చిపొయ్యుంటావ్"

"అందుకేరా, పదిండ్లు వొప్పుకున్నా. రిక్షా తెచ్చుకుణ్ణా. ఆ పిలకాయిల్ని కాన్వెంటు స్కూళ్ళకి తీసకపాయ్ తీసుకోనొస్తా. నా బతుకులో ఒక మొలకెట్టా మొలవకపాయె. కనీసం ఇట్లయినా నా ముచ్చట తీర్చుకుంటా"

ఆ మాటంటూ ఉంటే రంగయ్య గొంతుపూడుకపోయింది. గుడిసింట్లో రాణెమ్మ కుమిలి కుమిలి ఏడుస్తూ ఉంది.

లారీ కూలీలు మారుమాట్లాడకుండా వచ్చిన దోవ పట్టారు.

లారీ కూలీల మేస్త్రీ రంగయ్య 'రిక్షా రంగయ్య' అయ్యాడు.

ఇప్పుడు రంగయ్య ఠంచనుగా ఉదయాన తొమ్మిది గంటలకు రిక్షా ఎక్కుతాడు. రిక్షాతొక్కుతుంటే అతని మొగంలో ఏదో తృప్తి. అది భాషకందని తృప్తి. ఆ తృప్తి ఆహ్వానం పలుకుతూంటే రిక్షా ఆనందంగా తొక్కుతాడు. ఇంటింటి ముందర నిలబెడతాడు. గణగణ గంట కొడతాడు. ముచ్చటగా తయార్రై బుడిబుడినడకతో వస్తున్న పిల్లవాణ్ణి అమాంతంగా జవురుకొంటాడు. జాగ్రత్తగా రిక్షాలో కూర్చోపెడతాడు. చేతిలో సంచితీసి రిక్షాకు తగిలిస్తాడు. 'బద్రంగా కూసో బాబూ' అంటూ బయల్దేరతాడు.

వరసగా ఇంటింటి ముందర ఇంతే!

మనిషికి తృప్తిలో ఆనందం ఉంది.

రంగయ్యకు పిల్లల్నెత్తి రిక్షాలో కూర్చోబెట్టుకోవడంలో తృప్తి. కూర్చో బెట్టుకొని రిక్షాతొక్కడంలో తృప్తి. వాళ్ళమీద ఈగవాలనీయకుండా చూసుకోవడంలో తృప్తి. వాళ్ళు ఒకరితో

ఒకరు కొట్లాడుకొంటూంటే వద్దని బతిమాలడంలో తృప్తి. వాళ్ళకు క్యారియర్లు మోయడంలో తృప్తి. ఆ తృప్తిలో ఆనందం. ఆ ఆనందంలో పిల్లల్లో పిల్లవాడయ్యాడు రంగయ్య. తనజన్మమే తరించినట్లు మురిసిపోతున్నాడు.

అంతకుమించి ఆ పిల్లల తల్లిదండ్రులూ ఆనందపడిపోతున్నారు.

"ఏతల్లి కనిందో ఏమో పాపం! పిల్లలంటే ఎంత ఆపేక్ష వాడికి? ఎంత జాగ్రత్తగా చూసుకొంటున్నాడు. కన్న తల్లిదండ్రులైనా సరే వాడిముందు సిగ్గుపడాలి" అని ఒకరితో ఒకరు అనుకొంటున్నారు.

ఈ మాట ఆనోటా ఈనోటా పడి ఊరంతా పాకింది.

రంగయ్యకు గిరాకీ హెచ్చింది.

ఇప్పుడు రెండుట్రిప్పులు వేస్తున్నాడు.

రంగయ్య తనకు బిడ్డలు లేరన్నమాటే మరిచాడు. అందరు తనబిడ్డలే అని భావిస్తూ వాళ్ళతోనే తన ముద్దు ముచ్చట తీర్చుకొంటున్నాడు.

ఇప్పుడు రాణెమ్మ మనస్సు కూడా కుదట పడింది.

ఎప్పుడూ ఏదో పోగొట్టుకొన్నట్లుగా ముభావంగా తిరుగుతూ "ఏ జల్మంలో చేసిన పాపమో ఏంవో? ఈ జల్మలో దేవుడిట్లా చేసినాడు" అని కంట తడిపెడుతూంటే రాణెమ్మ కడుపు తరక్కపోయేది. 'అయ్యో, ఈ కడుపులో ఒక కాయ గాస్తే' అని మాటి మాటికి పొట్ట తడిమి చూసుకొనేది. తానేదో తప్పుచేసినట్లు తనలో తాను కుమిలిపోయేది. కానీ ఇప్పుడు భర్త ఆ మాటే మరిచినట్లుగా ఆనందంగా తిరుగుతూంటే ఆయన ఆనందమే తన ఆనందమన్నట్లుగా రాణెమ్మ అంతకంటే ఆనందంగా ఉంది.

కాలం ఉరుకుల పరుగులమీద ఉంది.

రంగయ్య సేవలకు పసిమనసులు పరవశిస్తున్నాయి. ఆ పసిమనసుల్ని కన్న ప్రేవులు మనసారా ఆశీర్వదిస్తున్నాయి. ఆ ఫలితమే అన్నట్లుగా రాణెమ్మ గర్భవతి అయింది.

రంగయ్య ఆనందానికి మేరలేదు.

ఇరుగు పొరుగును పిలిచి విందులిచ్చాడు. చాక్లెట్లు కొని పిల్లలకు పంచాడు. ఎందుకు రంగయ్యా? అని అడిగితే ఆ పసి కందులకు ఏమని చెప్పాలో తెలియక మొదట ముసిముసిగా నవ్వి ఆ తర్వాత బిక్కమొగంవేశాడు. 'చెప్తేనే తీసుకుంటాం' అని పట్టుబట్టితే ఎలాచెప్పాలో తెలియక 'మల్లా సెప్తాను తినండి బాబూ' అని బతిమాలి తినిపించాడు. నిలిచినచోట నిలవ లేక పోతున్నాడు. ఆనందం పట్టలేకపోతున్నాడు.

ఈ మార్పును గమనించిన పిల్లల తల్లిదండ్రులు 'ఏం రంగయ్యా? ఏం కథ? చాలా హుషారుగా ఉన్నావే?' అని అడిగితే సిగ్గులో చిగులుకొని మెలికలు తిరిగిపోతూ 'నా పెండ్లాం నీళ్ళుపోసుకొనిందమ్మా' అంటున్నాడు.

"అయితే ఇంక అయినట్లే. నీకొక పిల్లోడుపుడ్తే ఇంక ఈ పిల్లోళ్ళ గతియింతే!" అని అంటే "అదేందమ్మా అట్టంటారే? ఈ పిల్లోళ్ళు పెట్టిన కూడు తినేగదా ఇన్నాళ్ళు బతికినా. ఇప్పుడు నాకొక్కడు పుడ్తే మాత్రం ఈళ్ళకన్నా ఎక్కవా వాడు? ఇంకెప్పుడు అట్టనద్దమ్మా" అని కోపాన్ని ప్రకటిస్తున్నాడు.

రాణెమ్మను మాత్రం మహారాణిలా చూసుకొంటున్నాడు.

తొమ్మిది నెలల గడవడం ఎంతసేపు? తొమ్మిది దినాల్లా గడిచిపోయాయి. రాణెమ్మ ప్రసవించింది. మగబిడ్డ. అయితే రంగయ్య పుత్రోత్సాహాన్ని మాత్రమే మిగిల్చి తాను వెళ్ళిపోయింది.

రంగయ్య కాళ్ళు విరిగిన మంచంలా కుప్పగా కూలిపోయాడు.

రాణెమ్మ తన బతుకులో కాలుపెట్టిన తర్వాతనే తన బతుకొక దారిన పడిందని రంగ్యయ నమ్మకం. అందులో తనకష్టసుఖాల్ని పంచుకొని కనుసన్నల్లో మెలిగింది. ఆమె లేని ప్రపంచం రంగయ్యకు శూన్యంగా కనుపిస్తూ ఉంది. ఆమెలేని ఈ లోకంలో తాను బతకలేనంటూ బోరుమని ఏడుస్తున్నాడు.

రంగయ్య ఏడుస్తుంటే పిల్లలు ఏడుస్తున్నారు. పిల్లలు ఏడుస్తుంటే వాళ్ళ తల్లిదండ్రులూ బాధపడిపోతున్నారు.

"రంగయ్యా! పోయినవాళ్ళతో కలిసి మనం పోబోయ్యేది లేదు కదా? లేదు. ఎంత ఏడ్చి మొత్తుకొన్నా వాళ్ళు తిరిగి రాబోయ్యేది లేదు కదా? ఇంక ఏడ్చిందానివల్ల ఏం లాభం? నీ బతుకులో లేక లేక కలిగిన బిడ్డ. నీ రాణెమ్మ నీకు ప్రసాదించిన బిడ్డ. ఇట్లా ఏడ్చి ఏడ్చి నువ్వొక గతిబట్టిపోతే ఆ బిడ్డ గతేంటిటి? ఆ బిడ్డ కోసమైన నువ్వు బతికి బాగుండాలికదా?" అని పిల్లల తల్లిదండ్రులు హితవు చెప్పారు. ఇరుగు పొరుగు ధైర్యం చెప్పారు.

రంగయ్య మనసురాయి చేసుకొన్నాడు.

అరునూరైనా నూరు అరైనా తన కొడుకును ఒక ప్రయోజకుడిని చేయాలని పట్టుబట్టాడు. ఆ పురిటి కందుతో పడరాని పాట్లు పడ్డాడు. కడపటికి తన పట్టు సాధించాడు.

రంగయ్యకొడుకు రాఘవ ఇప్పుడు బ్యాంక్ఆఫీసర్.

రాఘవ బ్యాంక్ఆఫీసర్రై ఆరేండ్లయింది. పెండ్లిచేసుకొని అయిదేండ్లయింది. అతడు ఇప్పుడు ఉంటున్నది నెల్లూరులో.

ఆ కొడుకు జాబురాస్తాడని రంగయ్య ఎదురు చూస్తున్నాడు. ఆరేండ్లనుంచి ఎదురు చూస్తున్నాడు. సరిగ్గా ఉదయం పదకొండు గంటలకు తన గుడిసింట ముందర నిలబడి తపాలా బంట్రోతు దానయ్య కోసరం ఎదురు చూస్తున్నాడు.

దానయ్య ప్రతిరోజు వస్తున్నాడు. పోతున్నాడు.

రంగయ్య జాబు కోసరం ఎదురు చూస్తూనే ఉన్నాడు.

ఏడేండ్ల తర్వాత ఒకానొక రోజు. ఉదయం పదకొండు గంటలవుతున్న వేళ. రంగయ్య ఇంటి ముందర రిక్షా నిలబెట్టాడు. రిక్షా చక్రాలకు వెనకా ముందు రాళ్ళు కట్టాడు. మొగానికి ముంజేతులకు పట్టిన చెమటను తుండుగుడ్డతో తుడుచుకొంటూ గుడిసింటి తాళం తీశాడు. సత్తులోటా కోసరం మసక చీకట్లో కండ్లు చించుకొని చూస్తున్నాడు. 'రంగయ్యా' అన్న పిలుపు చెవినిపడింది.

పిలుస్తున్నది దానయ్య అని తెలుసు.

ఒక్క అడుగులో వాకిట్లోకి వచ్చి వాలాడు.

"నీకొడుకు దగ్గర్నుండి మనియార్డ్రు వచ్చింది గద రంగయ్యా" అంటూ దానయ్య గుడిసింటి ముందరికి వచ్చాడు.

రంగయ్యకు అది కలా? నిజమా? అర్థం కావడంలేదు. 'నిజమేనా?' అని అడగదామంటే నోరు పెగల్లేదు. ఆశ్చర్యం, ఆనందం, తృప్తి అన్నీ కలగలిసి రంగయ్య మీద దాడిచేస్తే పాపం! ఆ ముసలి ప్రాణి తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నాడు.

"అబ్బ! ఎంత కాలానికి వాడికి నీమీద దయపుట్టిందయ్యా? అడిగడిగి నాతాడు తెంపినా చేతుల్లో పెడుతుంటివి" అని అంటూనే దానయ్య రంగయ్య చేవ్రాలు తీసుకొని వందరూపాయలు రంగయ్య చేతుల్లో పెట్టాడు.

ఒక్క వందకాదు. ఎన్నో వందలు చూసిన చేతులవి. అయినా ఆ వందరూపాయలు చేతిలో ఉంటే ఆ ఆనందమే వేరుగా ఉంది. అది తన కొడుకు పంపినడబ్బు. తాను ఒక్కజాబు కోసరం ఎదురుచూస్తే తనకొడుకు తనను రమ్మని పంపినడబ్బు. తాను ఎంతో కాలం కార్చిన చెమటకు ప్రతిఫలం ఆ డబ్బు!!

అందుకే రంగయ్య ఆనందానికి అవధులు లేవు.

ఆ పది- పది రూపాయలనోట్లని ఈ చేతిలో అయిదు ఆ చేతిలో అయిదుగా పట్టుకొన్నాడు. అవి నలుగురి కంట పడేటట్లుగా చేతులు పైకెత్తి పట్టుకొని పరుగందుకొన్నాడు. ఆ రేపటెండలో పరుగెత్తుతూంటే ఆ నోట్లు గాలికి రెపరెపలాడుతున్నాయి. అలానే రంగయ్య ఆ కాలనీలో ఇంటింటికి తిరిగాడు. 'ఒరే! నాకొడుకు నన్ను మర్సిపొయ్‌నాడంట్రే. సూడండి? మర్సి పొయ్‌నాడేఁవో సూడండి... నూర్రూపాయలు పంపించినాడు సూడండ్రా" అంటూ కనిపించిన వాడికంతా చెప్తూ చూపిస్తూ పరుగెత్తుతున్నాడు. 'ఈ ముసిలోడీ ఆనందంతో గుండె పగిలి సస్తాడేఁవో' అన్న సందేహం కలిగేటట్లు పరుగెత్తుతున్నాడు. అలా పరుగెత్తి అందరికీ ఈ వార్త అందచేశాడు. ఆ తర్వాత వచ్చి రిక్షా ఎక్కాడు. రిక్షాక్కూడా హుషార్ వచ్చినట్లుంది. దారిపల్లంగా ఉంది. గాలి వాటంగా ఉంది. ఆగమేఘాలమీద వచ్చి చిన్న బజార్లో ఆగింది.

ఒక్క కిలో చాక్లెట్లు కొన్నాడు రంగయ్య.

నేరుగా లారీ కూలీలదగ్గరకి వెళ్ళాడు. తలా రెండు చాక్లెట్లు ఇచ్చాడు. 'ఏం రంగయ్యా? ఇప్పుడు స్కూలికి మూడుట్రిప్పులు శాన్సు కొట్టేసినట్లుండాదే?' అని వాళ్ళంటే "ఎదవనాయాండ్ల కెప్పుడు సూదు యాపారం బుద్ధులే!... ఈ పొద్దు నాకొడుకు నూర్రూపాయలు పంపించినాడ్రా" అని గర్వంగా చెప్పాడు. అప్పటికే గంట పన్నెండు దాటుతూ ఉంటే 'అరెరె! పిల్లకాయిలకు అన్నం తీసుకొని పోవాల్రో' అంటూ రిక్షా ఎక్కాడు. ప్రతి ఇంట దగ్గర కేరియర్ తీసుకొంటూ రెండు చాక్లెట్లు వాళ్ళ చేతుల్లో పెట్టాడు. 'ఏం రంగయ్యా?' అంటే 'నాకొడుకీ పొద్దు దుడ్లు పంపించినాడమ్మా' అని ముసిముసిగా నవ్వుతూ మెలికలు తిరిగాడు. పిల్లల కందరికీ భోజనాలు పెడ్తూ మిగిలిన చాక్లెట్లని అందరికీ సమంగా పంచాడు. 'ఈ పొద్దు జీతం రోజు కూడా కాదే? ఎందుకు చాక్‌లెట్లు పంచుతున్నావ్ రంగయ్యా?' అని అడిగితే 'నాకొడుకీ పొద్దు మనియాడ్రు పంపించినాడు బాబూ' అని అంటూంటే లొక్కి దవడల్లో ఒక వింత కాంతి నిక్కినీల్గింది.

ఆ రాత్రి రంగయ్య పడుకున్నాడన్న మాటేకాని కంటిమీద రెప్ప పడితే ఒట్టు. రకరకాల ఆలోచనలతోనే తెల్లారింది. నిద్రలేస్తూనే రంగయ్య నిత్యకృత్యాలు తీర్చుకొన్నాడు. 'ఇన్నాళ్ళకు నా యందు దయకలిగిందా సావీ ఏడు కొండలవాడా?' అని నట్టింట పటానికి సాగిలబడి మొక్కాడు. ఆ రాత్రంతా నిద్రలేకుండా ఆలోచించినట్లుగానే తన బాధ్యతల్ని ఆ కాలనీలో తనకు నచ్చిన ఒక కుర్రవాడికి అప్పచెప్పాడు. ఆ తర్వాత ఇంటింటికివెళ్ళి 'అమ్మా ఇంతకాలానికి నాకొడుక్కు నామింద దయకలిగినట్లుంది. ఇంతకాలం ఎట్లానో ఒకట్లా లాక్కొనొచ్చినా. ఇంకెట్లరా తండ్రీ!' నాలోనేను కుచవలతా ఉంటే ఆ దేముడే వాడి మణుసులో దూరి ఈదోవ సూపించినట్లుండాది. 'వెళ్ళొస్తానమ్మా' అని రెండు చేతులెత్తి దండం పెడ్తే వాళ్ళ కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. రంగయ్య వెళ్ళిపోతున్నాడంటే పిల్లలు ఒకటే గోల.

అయినా తప్పలేదు.

అందరి దగ్గర సెలవు తీసుకొన్నాడు రంగయ్య. ఏదోబాధ. ఎంత బిగబట్టినా కన్నీళ్ళను పట్టలేక పోతున్నాడు. ఇంతకాలంగా బతికిన ఊరిని, ఊళ్ళో మనుషుల్ని, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన పసికందుల్ని ఒక్కసారిగా వదిలిపెట్టి పోవాలంటే గుండె చెరువయింది. అయినా నిబ్బరించుకొన్నాడు.

నిట్టూరుస్తూ నెల్లూరుబస్సు ఎక్కాడు.

బస్సు కదిలింది. వేగాన్ని పుంజుకొనింది. నిగనిగమెరుస్తున్న నల్లటి తారు రోడ్డును మింగేస్తున్నట్లుగా ముందుకు దూసుకు పోతూ ఉంది. పురిటి కందును తన కప్పగించి రాణెమ్మ గుటుక్కుమంటే తాను పడిన కష్టాలు ఆ కష్టాలకు కానుకగా ఇంత కాలానికి తనకు దక్కుతున్న ప్రతిఫలాన్ని తలపోస్తూ కండ్లు మూసుకొని కమ్మని ఊహల్లో తేలియాడుతున్నాడు రంగయ్య.

బస్సు నెల్లూరులో ఆగింది.

రంగయ్య బస్సు దిగాడు. ఊరు కొత్త అయినా వృత్తికొత్తగాదు. రిక్షావాళ్ళతో మాటా మాటా కలిపాడు. కొడుకు ఇల్లు కనుక్కోవడానికి రంగయ్య పెద్దగా శ్రమ పడవలసిన అవసరం లేకపోయింది.

ఇంటి ముందర రిక్షా ఆగింది. రిక్షాదిగుతూ ఉంటే తనకోసమే ఎదురుచూస్తున్నట్లుగా కొడుకూ కోడలు ఎదురొచ్చారు. కొడుకు ఆప్యాయంగా పలకరించాడు. కోడలు నమస్కరించింది.

రంగయ్య గుండెలు ఆనందంతో తడిసి ముద్దయితే కన్నులు చెమ్మగిల్లాయి. చెమ్మగిల్లిన కండ్లని పై గుడ్డతో వత్తుకుంటూ లోనికి నడుస్తున్నాడు. కొడుకు కోడలు ఇద్దరు చెరొకవైపుగా అనుసరిస్తున్నారు. చూడముచ్చటగా వున్న ఆ మిద్దెలో అడుగు పెడుతూంటే ఏదో స్వర్గ లోకంలోకి అడుగుపెట్టినట్లుంది. అయినా రంగయ్య గుండెల్లో ఏదో ఒకమూల నక్కి ఉండిందో బాధ. గబుక్కున బయటపడింది.

"ఏఁవిరా నాయినా? ఇన్నాళ్ళకీ ముసిలోడు గుర్తుకొచ్చినాడా? రాకపోతే పోయింది. ఒక్క జాబు ముక్క రాసేదానిక్కూడా ఓపిక లేకపొయ్యిందా? కని నా ఎదాన పారేసి దానిదోవ అది చూసుకుంటే కన్నగపాట్లుపడి సాకి సంతరించినోడు ఒకడుండాడని కలవరం కూడా నీకు లేకపొయ్యిందే? పోనీ! నీకు లేకపోతే నాకు ఉండదా? ఆడ నేనెట్లా ఎదురు సూసినానో నీకేం తెలుసురా? అంతేలే! రేపు నీకు బిడ్డలు పుడ్తే అప్పుడు తెలిస్తింది కడుపు తీపంటే?"

"పుడ్తే ఏఁవిటి మాఁవయ్యా. పుట్టారు. ఒక మనవడు, మనఁవరాలు"

కోడలు అంటూ ఉంటే– అంతలోనే 'మమ్మీ' 'డాడీ' అంటూ ముద్దులు మూటగట్టినట్లున్న నాలుగేళ్ళ బాబు, మూడేళ్ళ పాప ఎదురొచ్చారు.

"మీ తాతయ్య బాబూ" అన్నమాటను చిరునవ్వుతో తడిపి రాఘవ అంటూంటే ఆ పసికూన లిద్దరూ విస్తుపోయి చూస్తున్నారు.

అంతేగదా? ఇంతకాలంగా లేని తాత ఇప్పుడు ఎలా ఊడిపడ్డాడా? అని.

పసిపాపల్ని ఎలా చూడాలో తెలుసు రంగయ్యకు. ఎలా లాలించాలో తెలుసు రంగయ్యకు. అందుకే ఆప్యాయంగా చూస్తూ అమాంతంగా ఆ ఇద్దర్నీ చెరొక చేత్తో జవురుకొన్నాడు. ఖూరు మాట్లాడకుండా ఆ పిల్లలిద్దరూ బొమ్మల్లాగా రంగయ్య చేతుల్లో ఉంటే ఇంటికోడలు వింతగా చూస్తూ ఉంది.

"చూశావా రాజీ! నేను చెబితే నమ్మకుండా ఏమేమో అన్నావే? మానాన్న అంటే ఏమనుకొన్నావ్? ఆయన దగ్గర అద్భుతమైన సమ్మోహనాస్త్రం ఉందే! ఎవరిపిల్లలైనా సరే! ఎంత పెంకి ఘటాలైనా సరే. ఆయనచేతి స్పర్శతగిలితే అంతే! కీ ఇచ్చిన బొమ్మల్లాగా 'కా' అంటే కా. 'కీ' అంటే 'కీ'. కద నాన్నా".

రంగయ్య కొడుకు వైపు ఒక్క చూపు చూశాడు. ఆ చూపుల్లో ఎంత తృప్తి? ఎంత ఆనందం? ఎంత ప్రసన్నత?

"నాన్నా నీకు తెలుసునో తెలియదో కానీ నీకోడలుకూడా నాతో పనిచేస్తూ ఉంది. అందుకే ఇంత మంచి ఇల్లు కట్టుకోగలిగాను. ఎంత ఉండీ ఏం ప్రయోజనం? నిద్రలేచి లేవడంతోటే ఆదరాబాదరా వండి అంతతిని, అంత మధ్యాహ్నానికి కట్టుకొని బయల్దేరే సరికి సరిపోతుంది. పనిమనిషిని పెట్టుకోవడానికి కంటే ఈరోజుల్లో ఇంట్లో ఒక పులిని పెంచుకోవచ్చు. నీ మనవడికి నాలుగేండ్లు. మనవరాలికి మూడేండ్లు. ఇద్దర్నీ కాన్వెంటుకు పంపాలి. ఈ రోజుల్లో మీకు తెలియందేముంది? ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. మొన్న ఒకరిక్షావాడు మా బ్యాంక్‌లో ఆఫీసర్ కొడుకుని అమ్మేసి పరారయ్యాడు. మీరైతే నాన్నా! ఇంక మాకేదిగులు ఉండదు. ఎవరెవరో పిల్లల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకునేకంటే నీ మనవణ్ణి మనవరాల్ని ఎలా చూసుకొంటారో చెప్పాలా నాయనా? అందుకే రిక్షాకూడా కొనిపెట్టాను. కొత్తరిక్షా నాన్నా"

భూమి బద్దలు కాలేదు. ఆకాశం ఊడిపడలేదు. సూర్యచంద్రులు గతులు తప్పలేదు. కన్నీళ్ళు కాల్వలు కట్టలేదు. ఎవరి గుండెలు పగిలిపోలేదు. శ్రావణకుమార్ అంధులైన తల్లిదండ్రుల్ని కావడిలో మోసిన కర్మభూమి కదా ఇది!

రంగయ్య మహావేదాంతిలా చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వులో అంతరార్థం అతనికే తెలియాలి మరి? ●

---

ఆంధ్రజ్యోతి
(దీపావళి ప్రత్యేక సంచిక, నవంబర్-1985)